క్లుప్తంగా

నేత్రపర్వం.. గ్రామోత్సవం



అమ్మవారిని ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు తంగెళ్ళమూడి 28వ డివిజన్‌లో సీతారామ నగర్ చెరువుగట్టుపై వేంచేసియున్న శ్రీ విఘ్నేశ, శ్రీరామాలయ, శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దసరా మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆదివారం అమ్మవారి సంకీర్తనలతో భజనలు చేశా రు. అనంతరం అమ్మవారిని నిమజ్జన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో బీడీ కాలనీ, లునాని నగర్, లక్ష్మి నగర్ భక్తులు పాల్గొన్నారు.

రీసర్వే ప్రారంభం



రీసర్వే చేస్తున్న సిబ్బంది

దెందులూరు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో మూడు గ్రామాల్లో రీసర్వే పనులు ప్రారంభమయ్యాయని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. దెందులూరు మండలం రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్ర, మండల సర్వేయర్ రమణారావు అన్ని గ్రామాల సర్వేయర్‌లు, వీఆర్వోలు, వీఆర్ఏలు సమష్టిగా నాగులదేవునిపాడు 638 ఎకరాలు, సింగవరంలో 774 ఎకరాలు, వేగవరంలో 738 ఎకరాలు, గోపన్నపాలెంలో 423 ఎకరాల్లో సరిహద్దుల ఏర్పాటు ప్రక్రియ నిర్వహిస్తున్నారు. రీ సర్వే పనులు పూర్తి స్థాయి పారదర్శకంగా చేస్తున్నారని తెలిపారు. ఆదివారం వేగవరం, సింగవరం నాగులదేవునిపాడు గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనులను తహసీల్దార్ సుమతి, రీసర్వే డీటీ రవిచంద్ర పరిశీలించారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

దెందులూరు: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏసీ, ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్ రిపేర్‌లో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇస్తామని యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ ప్రతినిధి శిరోమణి అన్నారు. ఆదివారం దెందులూరులో ఆమె మాట్లాడుతూ ఏలూరులో ఉచితంగా 30 రోజుల శిక్షణ ఇస్తామన్నారు. వయసు 19 నుంచి 45 సంవత్సరాల లోపు ఉండాలని ఐదో తరగతి ఉత్తీర్ణత ఉండాలన్నారు. ఆధార్ కార్డు కలిగి ఉండాలన్నారు. ఉచిత నివాసం, భోజనం మెటీరియల్ శిక్షణ సమయంలో ఇస్తామని గ్రామీణ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

పెదవేగి: పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం న్యాయంపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.9360 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: శ్రీవిద్యమ్మ ఆలయ పునర్నిర్మాణం చేపడుతున్నట్లు రజక సంఘ సభ్యులు ఆదివారం తెలిపారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయానికి వెనుక ఉన్న పూర్వపు ఆలయ స్థానంలో నూతన ఆలయ నిర్మాణానికి భూమి పూజలు చేసి, శంకుస్థాపన నిర్వహించారు. సుమారు రూ.15 లక్షల అంచనాతో ఆలయ నిర్మాణానికి ప్రతిపాదనలో సిద్ధం చేశామన్నారు. కంకర కోనేరు గట్టుపై ఉన్న ప్రదేశంలో శంకుస్థాపన పూజలు నిర్వహించారు.

పంచాయతీకి ట్యాంకర్ బహూకరణ



పంచాయతీకి సమకూరిన వాటర్ ట్యాంక్

కొయ్యలగూడెం: సరిపల్లి పంచాయతీకి వాటర్ ట్యాంకర్ సమకూరింది. గ్రామానికి చెందిన ఆవల గంగరాజు జ్ఞాపకార్థం కుటుంబీకులు 1,50,000తో ట్రాక్టర్ ట్యాంకర్‌ను పంచాయతీకి అందజేశారు. ట్యాంకర్ ద్వారా తాగునీటిని గ్రామ ప్రజలకు అత్యవసర సమయాల్లో అందించేందుకు కృషి చేయాల్సిందిగా పంచాయతీని దాతలు కోరారు. ఈ సందర్భంగా పంచాయతీ పాలకవర్గ సభ్యులు గంగరాజు కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరణ ఎప్పుడో?

- ఎన్నికల హామీలు విస్మరించిన కూటమి సర్కారు
- పని గంటలను పెంచి కార్మికుల హక్కులపై దాడి
- ఏడాదిన్నర పాలనలో వంచనకు గురైన కార్మికులు
- భవిష్యత్ కార్యాచరణకు సిద్ధమవుతున్న కార్మిక నేతలు



ఆందోళనలో పాల్గొన్న భవన నిర్మాణ కార్మికులు (ఫైల్)

నిడమర్రు: ఎన్నికలు వచ్చాయంటే చంద్రబాబు నోటి వెంట అనేక పథకాలు, హామీలు అవలీలగా వచ్చేస్తాయి. అన్ని వర్గాల వారిని మోసం చేయడానికి అనేక సంక్షేమ పథకాలు టీడీపీ మేనిఫెస్టోలో చేరుతాయి. గత ప్రభుత్వ హయాంలో ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకోవడంతో భవన నిర్మాణ కార్మికులకు రోజూ పనులు దొరికేవి. రెండు పూటలా కుటుంబం కడుపు నిండా భోజనం చేసేవారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తరువాత ఉచిత ఇసుక పేరు చెప్పి నియోజకవర్గాల వారీగా ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసి, అధిక ధరలకు అమ్మకాలు సాగించడంతో భవన నిర్మాణ రంగం కుదేలవుతుంది. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీ విస్మరించడం, మరో పక్క ఇటీవల అసంఘటిత కార్మికులకు పనిని 8 నుంచి 10 గంటలకు పెంచుతూ కూటమి ప్రభుత్వం జీవో విడుదల చేయడంతో కార్మిక హక్కులపై దాడి చేసిందంటూ వారు ఆదోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దశల వారీగా కూటమి ప్రభుత్వంపై ఆందోళన కార్యక్రమాలకు నేతలు సిద్ధమవుతున్నట్లు ఆయా సంఘాల నేతలు స్పష్టం చేస్తున్నారు.

అతీగతీలేని ఎన్నికల వాగ్దానాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా స్వయంగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చేసిన వాగ్దానాలు అతీగతీ లేకుండా పోయాయని కార్మికులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2006లో ఏర్పాటు చేసిన భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో పునరుద్ధరిస్తామని, కార్మికుల సంక్షేమానికి అవసరమైన 9 రకాల పథకాలు అమలు చేస్తామని, కార్మికులకు అన్ని విధాలా సహకరిస్తామని చెప్పిన పాలకులు ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్నా నోరు మెదపడం లేదని వాపోతున్నారు. గత నెల 15న విజయవాడలో వేలాది మంది కార్మికులు కలిసి కార్మికశాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడించినా ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని విమర్శలు వెల్లువెత్తున్నాయి.

నియోజకవర్గంలో 32 వేల మంది

ఉంగుటూరు నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 32 వేల మంది అసంఘటిత రంగంలో భవన నిర్మాణ కార్మికులుగా జీవనం సాగిస్తున్నారు. తాపీ, పెయింటింగ్, రాడ్ బెండింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్, సెంట్రింగ్, మార్బుల్, టైల్స్, కంకర, ఇసుక రవాణా, మట్టి పని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తదితర పనులతో జీవిస్తున్నారు. వీరికి సరైన పనులు లేక ఇతర రాష్ట్రాలకు వలసలు పోతున్నారు.

మేడే స్ఫూర్తిని కాలరాసిన కూటమి ప్రభుత్వం

150 ఏళ్ల క్రితం 16 గంటల పని దినం ఉండేదని, ఎంతో మంది అసువులు బాసిన పోరాటాలు, త్యాగాల ఫలితంగా 8 గంటల పని దినం సాధించినట్లు కార్మిక నేతలు చెబుతున్నారు. ఆ స్ఫూర్తే మేడే దినోత్సవం కార్మికుల హక్కులు సాధించిన రోజు. ఆ స్ఫూర్తిని కాలరాసేలా కూటమి సర్కారు చర్యలు తీసుకుంది. 8 గంటల పనిని 10 గంటలకు పెంచుతూ అవసరమైతే 13 గంటల వరకు చేయించుకునే హక్కు కార్పొరేట్ యజమానులకు కట్టబెట్టినట్లు చెబుతున్నారు. కట్టు బానిసలుగా తయారు చేస్తున్న చంద్రబాబు సర్కారు నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని కార్మిక వర్గం డిమాండ్ చేస్తుంది.

ఏడాదిన్నరగా వంచనకు గురైన కార్మికులు



గత సార్వత్రిక ఎన్నికలసమయంలో స్వయంగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకివచ్చి ఏడాదిన్నర కావస్తోంది. ఇప్పటివరకు ఒక్క వాగ్దానంకూడా అమలు చేయలేదు. పైగా పనిగంటలు పెంచుతూ కార్మికుల హక్కులు కాలరాస్తూ, కార్పొరేట్ సంస్థలకు మేలుచేసేలా కూటమి సర్కారు చర్యలు సిగ్గుచేటు.

– నారపల్లి రమణారావు, రాష్ట్ర అధ్యక్షులు, భవన నిర్మాణ కార్మిక సంఘం

బీమా పథకం వర్తింపజేయాలి



తెలంగాణ మాదిరిగా ఇక్కడ కార్మికులకు బీమా పథకం వర్తింపజేయాలి. చనిపోయిన భవన నిర్మాణ కార్మికులకు పరిహారం అందించాలి. ఉచిత ఇసుక పేరుతో మార్కెట్‌లో పెంచిన ఇసుక ధరలను నియంత్రించాలి. నిర్మాణ రంగ కార్మికులను ఆదుకోకుంటే కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

– ఎర్రా రాంబాబు, జిల్లా అధ్యక్షుడు, భవన నిర్మాణ కార్మిక సంఘం

మహిళలకు చట్టాలపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న సీఐ రాజశేఖర్

దెందులూరు: దోసపాడులో పెదవేగి సీఐ రాజశేఖర్ పోలీస్ గ్రామసభ నిర్వహించారు. మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలు, సైబర్ నేరాలు, డ్రగ్స్ మద్యం దుర్వినియోగంపై ప్రభుత్వ చర్యలు, శిక్షలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ శాంతియుతంగా వివాదాలకు దూరంగా ప్రశాంత జీవనం కొనసాగించాలన్నారు. పాత నేరస్తులు, రౌడీ షీటర్లపై పూర్తి స్థాయి నిఘా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్సై సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆటల పోటీలు

జంగారెడ్డిగూడెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ సోమవారం జంగారెడ్డిగూడెం జెడ్పీ బాలుర హైస్కూల్‌లో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల హెచ్ఎం పి.సోమశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగ, అథ్లెటిక్స్, షటిల్ పోటీల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర పాఠశాలల విద్యార్థులు ఎంపికలో పాల్గొనాలని కోరారు.

పేకాట స్థావరంపై దాడి

చింతలపూడి: చింతలపూడి పట్టణం శివారు గురుభట్లగూడెం రోడ్‌లో పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడులు చేశారు. దాడుల్లో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.9,300 నగదును స్వాధీనం చేసుకున్నారు. సీఐ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో ఎస్సై కె.సతీష్‌కుమార్ కేసు నమోదు చేశారు.

వైభవంగా అమ్మవారి ఊరేగింపులు



దెందులూరు: అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



భీమడోలు: అమ్మవారి ఊరేగింపులో ఆకట్టుకున్న శక్తి వేషాలు

భీమడోలు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో దేవి నవరాత్రి ఉత్సవాల ముగింపుతో ఆదివారం అమ్మవార్ల గ్రామోత్సవాలు వైభవంగా నిర్వహించారు. భీమడోలులోని గుర్రాల చెరువు గట్టు వద్ద వేంచేసియున్న శ్రీకనకదుర్గదేవి ఊరేగింపు అట్టహాసంగా నిర్వహించారు. ఊరేగింపులో గణాచారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. మండలంలోని గుండుగొలను, పూళ్ల తదితర గ్రామాల్లో అమ్మవార్లను ఊరేగించారు. అమ్మవార్లను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదుర్గమ్మ గ్రామోత్సవం

దెందులూరు: దెందులూరులో మేకాలమ్మ చెరువు గట్టు ప్రాంతంలోని కనకదుర్గ విగ్రహ ఊరేగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. కమిటీ సభ్యుల పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సై ఆర్. శివాజీ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



భీమడోలు: ప్రత్యేక వాహనంలో ఊరేగుతున్న అమ్మవారు

దాత హరికృష్ణకు సత్కారం

ఎన్నారై ఇంజనీర్ ఏనుగు హరికృష్ణను ఆదివారం గోపన్నపాలెం కనకదుర్గమ్మ ఆలయంలో మాజీ సర్పంచ్ ఆలయ కమిటీ కొండేటి హనుమంతు, తోట రామకృష్ణ, కేబుల్ శ్రీను ఆలయ అర్చకులు హర్షా శర్మ సత్కరించారు. అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. గోపన్నపాలెం గ్రామస్తుడిగా ఇతర దేశాల్లో ఉన్నప్పటికీ దసరా మహోత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయానికి హరికృష్ణ, తన మిత్రుడితో కలిసి ఆర్థిక సాయం చేయడంపై కమిటీ సభ్యులు అభినందించారు.



దెందులూరు: దాత హరికృష్ణను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఘనంగా అన్నసమారాధనలు

జంగారెడ్డిగూడెం: దసరా ఉత్సవాల సందర్భంగా స్థానిక గంగానమ్మ ఆలయం వద్ద ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. దాతల సాయంతో ఏర్పాటు చేసిన ఈ మహాన్నదాన కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, కొండ్రెడ్డి కిషోర్, పరిమి సత్తిపండు, మండవల్లి సోంబాబు, వందనపు వెంకటేశ్వరరావు, డీకేడీ సత్యనారాయణ, పెనుమర్తి రామ్‌కుమార్, వగ్వాల పుల్లారావు, నడిపల్లి అంజనరావు, రాంబాబు ప్రారంభించారు.

మహాన్న నివేదన

పట్టణంలోని ఆటోనగర్‌లో కనకదుర్గమ్మ ఆలయం వద్ద అమ్మవారికి మహాన్న నివేదన సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అన్నం, పలు రకాల వంటకాలు నివేదనగా భక్తులు సమర్పించారు.

అయ్యప్ప ఆలయంలో..

మండలంలోని గుర్వాయిగూడెం హరిహరసుత అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నసమారాధన ఘనంగా నిర్వహించారు. దాతలుగా టిక్కిశవారిగూడెం రాసమంటి మురళీకృష్ణ దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు చామర్తి శ్రీరాములు, ప్రెసిడెంట్ చిన్ని వాసుస్వామి, గుంట్ల వెంకటేశ్వరరావు, కొల్లేపర కృష్ణారావు, తమ్మన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మహాన్నదానాన్ని ప్రారంభిస్తున్న జెట్టి గురునాథరావు, కరాటం రాంబాబు

గంగానమ్మ లడ్డూల వేలం



లడ్డూలను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

జంగారెడ్డిగూడెం: దసరా ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని గంగానమ్మకు నైవేద్యంగా పెట్టిన రెండు లడ్డూలను ఆదివారం వేలం నిర్వహించారు. అమ్మవారికి లలిత సూర్య స్వీట్స్ యజమాని ఆకుల రామచంద్రరావు నైవేద్యంగా సమర్పించిన 115 కేజీల డ్రైఫ్రూట్ లడ్డూ వేలం నిర్వహించగా, నడిపల్లి అంజనరావు వేలంలో రూ.1.55లక్షలకు దక్కించుకున్నారు.భక్తాంజనేయ స్వీట్స్ యజమాని గుబ్బల రాంబాబు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన 91 కేజీల డ్రైఫూట్ లడ్డూను వందనపు వెంకటేశ్వరరావు రూ.57789లకు దక్కించుకున్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలి



లండన్‌లో సమావేశం నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో లండన్‌లో సమావేశం నిర్వహించారు. దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ప్రభుత్వం ఆపే వరకు పోరాటం చేస్తామన్నారు.

వినూత్న రీతిలో విద్యా బోధన

భీమడోలు: పోలసానిపల్లి మోడల్ ప్రైమరీ పాఠశాలలో టీచర్ కె.మౌనిక విద్యార్థులకు వినూత్న రీతిలో విద్యా బోధన చేస్తూ చక్కని తర్ఫీదును అందిస్తున్నారు. ఇంగ్లిష్ సబ్జెక్టును బోధించే ఆ ఉపాధ్యాయిని చిన్నారులకు సులభంగా అర్థమయ్యే విధంగా ఆమె బోధనోపకరణాలను (టీఎల్ఎం) లను తయారు చేసి ప్రదర్శిస్తున్నారు. గత ప్రభుత్వం నాడు-నేడు పథకంలో ఈ పాఠశాలను అభివృద్ధి చేసి రూపు రేఖలను మార్చింది. విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవసరమైన అన్ని వసతులను కల్పించింది. ఇక్కడి విద్యార్థుల ఆధారంగా మోడల్ ప్రైమరీ పాఠశాలగా మారడంతో హెచ్ఎం కోలా ఉమా మహేశ్వరరావుతో పాటు మరో నలుగురు ఉపాధ్యాయులు కె.పరమానందం, కె.మౌనిక, కె.వెంకటేశ్వరరావు, నాగలక్ష్మి పని చేస్తున్నారు. అన్ని తరగతుల్లోనూ విద్యార్థులకు ఉపాధ్యాయులు చక్కగా బోధిస్తున్నారు. వీరిని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఆర్.వినోద్‌కుమార్, పాఠశాల సిబ్బంది అభినందిస్తున్నారు.



చిన్నారులకు అర్థమయ్యే రీతిలో బోధన చేస్తున్న ఉపాధ్యాయిని

నూకాలమ్మ ఆలయంలో గోపూజ

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గోపూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు కాళ్లకూరి శంకర్ మహేష్ శర్మ, కె.విజయ పవన్ శర్మ సంయుక్తంగా గోపూజ నిర్వహించారు. ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ 6వ తేదీ సోమవారం సాయంత్రం 4 గంటలకు ఆలయంలో చండీ హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చండీహోమంలో మహాపూర్ణాహుతి సమర్పించడం ద్వారా కార్యక్రమాలు సంపూర్ణమవుతాయని తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన వెండి చీర తయారీకి అంకురార్పణగా భక్తుల వద్ద నుంచి సేకరించిన వెండిని చీర తయారీకి ఆలయ శాశ్వత చైర్మన్ రాజాన సత్యనారాయణ ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి సభ్యులు కారింగుల పార్థసారథి సూర్యచంద్రరావు, వెంకట శ్రీదేవి దంపతుల చేతుల మీదుగా నిర్మాణకర్తలకు అందజేశారు.



గోపూజ నిర్వహిస్తున్న భక్తులు

దాత సాయంతో తీరిన నీటి కష్టాలు

గణపవరం: ఎటు చూసినా కాలుష్యం. చెరువులు, కాలువలు అన్నీ కాలుష్య కాసారాలుగా మారిపోయాయి. ముఖ్యంగా కొల్లేరు, డెల్టా గ్రామాల్లో ఆక్వా రంగం పుణ్యమా అని నీటి వనరులు మొత్తం కాలుష్యంతో నిండిపోయి, తాగడానికి గుక్కెడు మంచినీరు దొరకని దుస్థితి నెలకొంది. పంచాయతీ రక్షిత మంచినీటి పథకాల ద్వారా అందిస్తున్న నీరు తాగడానికి ఏ మాత్రం అనుకూలంగా లేని పరిస్థితి. దీంతో ప్రజలు తాగునీటి కోసం మినరల్ వాటర్ ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు. ప్రతి రోజూ మినరల్ వాటర్ కొని తాగాలంటే సామాన్య, మధ్య తరగతి ప్రజలకు తలకు మించిన భారంగా మారింది. ఈ నేపథ్యంలో గణపవరానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, దాత సాగిరాజు సుబ్బరాజు ఉచితంగా స్వచ్ఛమైన మంచినీరు అందిస్తూ, పేద, మధ్య తరగతి ప్రజలకు మంచి నీటి అవసరాలు తీర్చారు. దశాబ్ద కాలం క్రితం గణపవరంలో రూ.10 లక్షల వ్యయంతో ఒక నీటిశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం ద్వారా తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి రోజుకు 10 లీటర్ల తాగునీటిని ఉచితంగా అందిస్తున్నారు. ఈ కేంద్ర నిర్వహణకు ఏటా 6 నుంచి 7 లక్షల రూపాయలను ఖర్చు సుబ్బరాజు భరిస్తున్నారు. వాటర్ ప్లాంట్ నిర్వహణ నిమిత్తం ఇద్దరు సిబ్బందికి జీతాలు, ఫిల్టర్లు శుభ్రం చేయడానికి కావాల్సిన రసాయనాలు, ప్లాంటు మరమ్మతులకు ఈ మొత్తాన్ని ఉపయోగిస్తున్నారు. ప్రతి ఏటా జూలై 1వ తేదీన తెల్లరేషన్ కార్డుదారులకు ఏడాదికి సరిపడా కూపన్లు పంపిణీ చేస్తారు.ఎప్పుడు మంచినీటి కోసం వచ్చినా ఒక కూపన్ తెచ్చి మంచినీరు తీసుకెళతారు. దాత సాగిరాజు సుబ్బరాజుకు ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.



తాగునీరు పట్టుకుంటున్న ప్రజలు

నీటి నాణ్యత విషయంలో రాజీపడం



వాటర్ ప్లాంట్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం. మంచినీటి నాణ్యత విషయంలో రాజీ పడం. ఎంత ఖర్చయినా వెనుకాడం. నెలకోసారి ఫిల్టర్లు మార్చడం ద్వారా నీటి నాణ్యతకు చర్యలు తీసుకుంటున్నాం. రసాయనాలు తక్కువగా వినియోగిస్తాం.

–పొత్తూరి సుబ్బరాజు, వాటర్ ప్లాంట్ పర్యవేక్షకుడు